

# ప్రమోషను

ఘండికోట బ్రహ్మాజీరావు

ఆఫీసు కారిడారులో ఒకరికొకరం ఎదురుపడ్డాము. అతను పెద్ద దొరగారి ఛాంబరు నుండి వస్తున్నాడు – ఆ పులిబోనులోకి నేను వెళ్తున్నాను.

అతను నవ్వుతూ మరొకరితో మాట్లాడుతూ వస్తున్నాడు. అతని చేతిలో ఫైలొకటుంది. నన్ను చూడగానే ఆగిపోయాడు.

"మీరు... మీరు... నువ్వు... నువ్వు మూర్తివి కదూ?"

నేను ఆగిపోయాను – ఎన్నాళ్ల తరువాత ఇద్దరం కలిశాం! పాతికేళ్ల కింద రాజశేఖరం ఎంత టిప్‌టాప్‌గా వుండేవాడో ఇప్పుడూ అలాగే వున్నాడు. మేలు రకం టై, లోపలికి టక్ చేసిన షర్టు, ముఖం మీదకు జారే ఉంగరాల జుత్తుకు బదులు చిన్న బట్టతల, పెదవులపైన నవ్వు – అతను రాజశేఖరమని సులువుగా గుర్తుపట్టవచ్చు.

"బ్రదర్! ఎంతకాలమయింది నిన్ను చూసి!..." ఆశ్చర్యంతో ఏదో అన్నాను.

"అవును. నేను మూడు రోజుల క్రిందే ఈ ఆఫీసులో చేరాను, చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా! నువ్వేం చేస్తున్నావో అడగక్కరలేదు. చేతిలోని ఆ ఫైలే చెప్తొంది, నువ్వు కూడా మరో ఇన్‌స్పెక్టరువని."

రాజశేఖరంలోని గొప్పదనమే అది – ఎదుటివాడు ఏదో విధంగా తన కన్నా తక్కువే అని అతని అభిప్రాయం.

నేను చిన్న నవ్వు నవ్వి అన్నాను:

"ఒకప్పుడు నేను ఇన్‌స్పెక్టరునే. రెండేళ్ల కిందే నాకు అసిస్టెంట్ ఆఫీసర్ ప్రమోషను దొరికింది."

ఒక క్షణం అతను చేష్టలుడక్కి నిలిచాడు – వెంటనే షాక్ నుంచి తేరుకొని, పెదవుల మీద నవ్వు మళ్లా తెచ్చుకొని, తన మామూలు స్థితికి చేరుకున్నాడు.

"అవునయ్యా! ఏదో ఉద్యోగాలలో తేడాగాని, బరువంతా సమంగానే మోయాలి కదా!... వెళ్లు వెళ్ళు! పెద్ద దొరగారు ఖాళీగా వున్నారు."

మా పై అధికారి చండశాసనుడు. అతనితో కేసు గురించి మాట్లాడేటప్పుడు, దానికి సంబంధించిన అన్ని వివరాలూ క్షుణ్ణంగా తెలిసి వుండాలి. ఒక్కొక్కప్పుడు ఆయన చాలా లోతయిన ప్రశ్నలు వేస్తాడు. జవాబులు సరిగా లేకపోతే తినేస్తాడు. రాజశేఖరాన్ని కారిడారులో కలిసి మాట్లాడినప్పుడు చాలా సంగతులు మనస్సులో ముందు వెనుకలయాయి. అందుచేత అతని ఛాంబరులోకి ఆరుగంటలకు ప్రవేశించినవాడిని, తిరిగి పైకి వచ్చేసరికి ఏడున్నర అయింది. రాజశేఖరం సీటుకి వెళ్ళి చూస్తే అతను ఎప్పుడో వెళ్ళిపోయినట్టు తెలిసింది.

తరువాత నేను లైను మీదికి, అటు నుంచి రాగానే రెండు నెలలు బరోడా ఆఫీసర్ల కాలేజిలో ట్రెయినింగ్‌కి వెళ్ళిపోయాను.

తిరిగి వచ్చిన తరువాత రెండు మూడు సారులు రాజశేఖరాన్ని కారిడార్‌లోనే కలిశాను. ఒక సాయంకాలం మరో అయిదు నిమిషాలు ఇద్దరం మాట్లాడుకున్నప్పుడు అతను నవ్వుతూ అన్నాడు:

"మూర్తీ! ఈ ఆదివారం ఉదయం ఖాళీగా వుంటే మా ఇంటికి బ్రేక్‌ఫాస్టుకి రాకూడదూ! నేను మా సొంత బంగళాలోనే వున్న సంగతి నీకు తెలుసనుకుంటాను సాగర్‌నగర్‌లో ముందుకే బీచికి ఎదురుగుండా వుంటుంది. రాజశేఖరంగారి బంగళా అంటే ఎవరేనా చెప్తారు – జీప్ వేసుకొని వస్తే తొమ్మిది నుంచి పదకొండు వరకూ సరదాగా కాలం గడపవచ్చు."

"రాజశేఖరం! ఈ ఆదివారం నాకు పనుంది. వచ్చే ఆదివారం వీలుచూసుకొని రావచ్చా?"

"వచ్చే ఆదివారం కాదు, ఏ ఆదివారమైనా నువ్వు నిరభ్యంతరంగా రావచ్చు. ప్రతి ఆదివారం రమ్మని నిన్ను ఆహ్వానిస్తున్నాను."

నేను సంతోషంతో అంగీకరించాను – అతని ఆహ్వానం సాధారణంగా నా వంటి వాడికి దొరకదు – బహుశా ఇది మొదటిదనుకుంటాను.

అనుకున్న ప్రకారం ఆదివారం తొమ్మిది గంటలకు స్కూటరు మీద సాగర్ నగర్ చేరుకున్నాను – జీపేదీ దొరకలేదు. రాజశేఖరం బంగళా సులువుగా తెలుసుకున్నాను. అర ఎకరం జాగాలో చుట్టూ ఖాళీ స్థలం విడిచిపెట్టి మధ్యను కట్టించిన పెద్ద బంగళా అది.

ఆ బంగళాకు అన్నీ ప్రత్యేకమైనవే – గోడలకు వేసిన రంగులు, గదిలోని ఫర్నిచర్, బయటనున్న లాను, వరుసలుదీరిన పూలమొక్కలు – అన్నీ ఉన్నతశ్రేణికి చెందినవే – గోడలకున్న మోడరన్ ఆర్ట్ చిత్రాలు, రాజస్థాన్ ఫ్లవర్‌వేజులు, నేలను పరచిన పెర్షియన్ కార్పేటు అన్నీ చెప్పుకోదగ్గవి.

నేను ముందున్న గదిలోకి ప్రవేశించేసరికి, మరో ఇద్దరు అతిథులతో రాజశేఖరం మాట్లాడుతున్నాడు. నన్ను చూసి, పక్కనే సోఫా మీద కూర్చోమని చేతితో చూపించాడు. సంభాషణ అతను కొనసాగించాడు.

"అప్పుడు మాడం ఏమన్నారో తెలుసా? 'రాజశేఖర్! నేను సూప్‌లో మునిగిపోయాను – ఇరవై మంది గెస్టులు రాత్రి డిన్నరుకి వస్తున్నారు. వాళ్లలో సగం మంది అమెరికన్లు – అయిదుగురు బ్రిటిష్‌వాళ్ళు – ఇద్దరు ఫ్రెంచివాళ్లు – ముగ్గురు ఆస్ట్రేలియన్లు. ఈ సంగతి మీ దొరగారు టెలిఫోనులో చెప్పినప్పుడు నేను మతిపోయి చేతులెత్తేశాను. రాజశేఖరం చెవిలో, ఈ సంగతి పడేస్తే చాలునని జనరల్ మేనేజర్‌గారంటే నేనేం చేసేది' – ఆమె నా మీద భారమంతా పడేశారు."

నవ్వుతూ అతిథుల ముఖాలలోకి చూస్తూ అతను మౌనం వహించాడు.

ఆ గదిలో ఇద్దరే అతిథులు – ఒకరు అన్నారు:

"మీకు చాలా కష్టమయి వుంటుంది – ఒక్కొక్కరికి ఒక్కొక్క రకం – వాళ్ల అభిరుచులు వేరు – మీరు కత్తి మీద నడిచారనుకుంటాను."

రాజశేఖరం విలాసంగా నవ్వి అన్నాడు:

"అక్కడే రాజశేఖరం ప్రతిభ కనిపిస్తుంది – దొరగారి కారు తీసుకొని న్యూమార్కెట్ నుంచి అన్నీ తెచ్చాను. ఆ రాత్రి అమర్చిన ప్లేట్లలో, ఏ దేశం వారికి వారి భోజన పదార్థాలు కాక, అందరికీ అద్భుతమైన తందూరీ చికెన్, సాంబారులో గారెలు, దివ్యమైన రసగుల్లాలు ఈ విధంగా ఈస్టు వెస్టులను ఒక చోట చేర్చాను"

"రాజశేఖర్! యూ ఆర్ ఎ గ్రేట్ మాన్!" అన్నాడు రెండవ అతిథి.


"మీరన్నట్టే మాడమ్ కూడా అన్నారు – అతిథులందరికీ నా గురించి చెప్పారు. జనరల్ మేనేజరుగారికి బదిలీ అయి వెళ్ళిపోయినప్పుడు, అతని స్థానంలో వచ్చిన అతని భార్యతో నా గురించి చెప్పి అప్పగించారు. 'యు కెన్ డిపెండ్ అన్ హిమ్!' అని మరోసారి అన్నారు."


రాజశేఖరం ఇంకా ఏమో చెప్పేవాడే – ఇంతలో అతని భార్య వచ్చి అతిథులకు నమస్కారం చేసి బ్రేక్‌ఫాస్టు సిద్ధంగా వుందని, లోపలకు రమ్మని చెప్పింది.

"ఆహా! నేను పరిచయం చేయడం మరచిపోయాను. వీరు శ్రీమతి రాజశేఖర్! ఇతను మా స్నేహితుడు మూర్తి. వీరు న్యావల్ ఆఫీసర్ అగర్వాల్, వీరు పోర్టు ఆఫీసర్ నాగభూషణంగారు. రండి! బ్రేక్‌ఫాస్ట్ చల్లారి పోతున్నదిట'

బ్రేక్‌ఫాస్టు దివ్యంగా వుంది. అన్నిటిలోకీ జీడిపప్పు ఉప్మా చక్కగా వుంది. దేనికదే బాగున్నది. బహుశా అందరికీ అటువంటి గౌరవ మర్యాదలు తెలియవు.

మరో రెండు ఆదివారాలు రాజశేఖరం బంగళాకి వెళ్లాను. అతను ఏ విధంగా చీఫ్‌లు అందరికీ, సీజనులో వచ్చిన మొదటి పండు నుంచి, సీజను



అంతమయేవరకు ఎలా సుప్రసిద్ధమైన మామిడిపం డ్లను వారి టేబిళ్లకు అందించేడో చెప్పాడు.

రాజశేఖరం హెడ్డాఫీసులో అధికారుల ముద్దు బిడ్డడు.

అతను ఎంత మారిపోయాడో అనిపించింది ఒక సారి.

అతనూ నేనూ కాలేజీలో చదువుకున్నాము. వాళ్ల నాన్నగారు చాలా పెద్ద ఉద్యోగమే చేసేవారు కాబోలు – ఆ రోజుల్లో వారున్న ఇంటికి వెయ్యి రూపాయిలిచ్చేవారు. రాజశేఖరానికి ట్యూషను చెప్ప డానికి ఏ సబ్జెక్టు లెక్చరరు ఆ సబ్జెక్టు చెప్పేవాడు. కొంతమంది ఇంటికి వచ్చేవారు. కొంతమంది ఇళ్లకి అతనే కారు మీద వెళ్లేవాడు.

రాజశేఖరం పెద్ద వదవులలో వున్నవాళ్ల కొడుకు లతోనూ మంచి ధనవంతుల పుత్రులతోనూ స్నేహం చేయడంలో అబ్బురం లేదు – నా వంటి సాధా రణ కుటుంబాల నుంచి వచ్చిన ఓ నలుగురు విద్యార్థులను అతను చేరదీశాడు. వాళ్ల చేత లేబ రేటరీ పుస్తకాలలో బొమ్మలు వేయించడం, పాత ప్రశ్నపత్రాలను ఆన్సరు చేసి ఇవ్వమనడం మొద లైన పనులు చేయించేవాడు. నా పని, ఇంగ్లీషు లెక్చరరుగారి నోట్సు కాపీ చేయడం – అతనిం టికి రాజశేఖరం వెళ్తే, ఎవరికీ ఇవ్వని తన నోట్సు అతను ఇచ్చేవారు. మొదటిసారి ఆ నోట్సును కాపీ చేయడానికి ఇస్తూ అతనో సంగతి నిష్కర్షగా చెప్పాడు.

"మూర్తీ! నెలకు నూరు రూపాయలిచ్చి లెక్చర రుగారింటికి వెళ్లి ట్యూషను చెప్పించుకుంటున్నాను. వారికి నేనంటే ఎంతో వాత్సల్యం. ఆయన నోట్సు ఎంత గొప్పదో నీకు తెలుసు. అవి ఎవ్వరికీ ఆయన ఇవ్వరు. నాకు ఇచ్చారంటే చాలా గొప్ప సంగతి. నువ్వు నా కోసం కాపీ చేయడం మాత్రమే చెయ్య వలసింది. నీ కోసం ఒక కాపీ తయారుచేశావని తెలిస్తే నన్నతను గడప తొక్కనీయరు."

ఆ సంవత్సరం పెద్ద పరీక్షలలో నేను ఇంగ్లీ షులోను, సంస్కృతంలోను పాసయాము. గ్రూపు పోయింది. కడువు చేత పట్టుకొని ఉద్యోగానికి పోయి, అప్రంటిస్‌గా చేరాను.

ఆ విధంగా మేమిద్దరం దూరమయ్యాము.

పాతిక సంవత్సరాల తరువాత మళ్ళీ ఇప్పుడు కలుసుకున్నాం. ఇద్దరం ఒకే ఆఫీసులోనే, ఒకే శాఖలోనే పనిచేయడం విశేషమే.

రాజశేఖరం కుటుంబ విశేషాలు ఒక రోజు కూడా నేనడగలేదు. అతనికి పిల్లలు లేరు. అక్కచెల్లెళ్ళకు పెద్ద సంబంధాలు దొరికాయి – అతని తమ్ముళ్లు మంచి ఉద్యోగాలలో వున్నారు – తల్లిదండ్రులు చాలా కాలం కిందే పోయారు.

సాధ్యమైనంతవరకూ అతను ఆఫీసులో నన్ను తప్పించుకొని తిరిగేవాడు. నేను ఒక వారం రోజులు లైను మీద వెళ్ళవలసి వచ్చింది.

## చలంగారి చమత్కారాలు



"మీ రచనల్లో వచ్చే సారస పత్రాలు, శిరీష పుష్పాలు, జలజ పత్రసుగంధాలు ఈ లోకంలో వున్నాయంటారా?" అని అడిగితే...."అవన్నీ కవుల పువ్వులు, కవుల కాయలూ, కవుల ఆకులూ, చెట్లూనూ" అంటూ చమత్కరించారట "చలం" గారు.

"మీకు ఉత్తరం రాయడానికి కూడా నావద్ద డబ్బులు లేకుండా అయిపోయాయి. అందుకే ఆలస్యంగా రాస్తున్నాను." అంటూ ఓసారి ఉత్తరం వచ్చింది చలం గారికి, "పాపం! మీ ఇంట్లో చుట్టాలు చేరారా?" అని తిరుగు జవాబు ఇచ్చారట.

చలం గారి ఇంట్లో కాకా, కిట్టూ చిన్నపిల్లలు. ఎప్పుడూ అల్లరి చేసేవారట. మిత్రులను ఆటలు పట్టించే వారు. "పిల్లలు అల్లరిమాని బుద్ధిగా వుంటున్నారా?" అని రాస్తే, "అల్లర్లు మానేస్తే వాళ్ళు పిల్లలెలా అవుతారు చెప్పండి?" అంటూ చమత్కరించారట చలంగారు.

లైను నుంచి మధ్యాహ్నం మూడు తరువాత ఇల్లు చేరుకున్నాను. పెద్ద దొరగారు వెంటనే తనను కలియమని ఫోనులో చెప్పారు. భోజనం సరిగా చెయ్యకుండానే ఆఫీసుకి పరుగులు పెట్టాను.

నేను బెదురుతూ పెద్ద దొరగారి ఛాంబరులోకి ప్రవేశించాను. లోపల రాజశేఖరం దొరగారి టేబులు ఎదురుగా నిలబడ్డాడు – టేబిలు మీద పెద్ద స్టేట్‌మెంట్ అతని ఎదుట వుంది. దానిని చూడ గానే నా గుండెలు ఆగిపోయాయి. అది బోర్డుకి వెళ్లవలసిన స్టేట్‌మెంట్ – ఆ రోజు ఇరవయ్యో తారీకు – ఇరవై అయిదో తారీకు ఉదయం పది గంటలకు ఢిల్లీలోని బోర్డు ఛైర్మన్ టేబిలు మీద వుండాలి. లైను మీద వెళ్ళవలసిన తొందరలో దీని సంగతే మరచిపోయాను.

దొరగారు నన్ను కుర్చీ మీద కూర్చోమన్నారు. నేను కూర్చున్న తరువాత కర్కశంగా అన్నాడు:

"మూర్తీ! ఈ స్టేట్‌మెంట్ కంటే నీ లైను మీద పని గొప్పదని నేననుకోను. ఇంతగా బాధ్యత లేకుండా నువ్వు వ్యవహరిస్తావని నేననుకోలేదు."

నేను ఏమి చెప్పినా అతను వినిపించుకునే స్థితిలో లేరు.

అతను రాజశేఖరం వంక తిరిగారు:

"నీకీ స్టేట్‌మెంట్ గురించి తెలుసు – మూర్తి లైన్ మీద వెళ్ళిన మర్నాడే నిన్ను పిలిచి ఎలా తయారుచేయడమో చిలక్కి చెప్పినట్టు చెప్పాను – నీకు సందేహం వస్తే నన్నడగమన్నాను. ఇవాళ ఒక మనిషి ద్వారా దీనిని ఢిల్లీ పంపించాలని మరీ మరీ చెప్పాను. పదో గంట నుంచి నీ కోసం చూస్తున్నాను. రెండు గంటలకు నిన్ను పిలిపిస్తే, నా ముఖం మీద తప్పులు తడకలతోనున్న స్టేట్ మెంట్ పారేశావు."

అతను కోపంతో ఉద్రిక్తుడైపోతున్నాడు.

"నీకు ఈ పని ఇవ్వకుండా నేనే చేస్తే నిమి షాలలో అయేది. నీకు ఫండమెంటల్స్ కూడా తెలీవు. చెప్పి చెప్పి నేను విసిగిపోయాను."

అతను ఆ ధోరణిలోనే మాట్లాడుతున్నారు.

"హెడ్డాఫీసులో ఒక చీఫ్ నన్ను బ్రతిమాలి, ఈ రాజశేఖరాన్ని నా మీదకు రుద్దాడు – ఎంతో చాకచక్యంగలవాడన్నాడు – నా సొంత పనులన్నీ త్రుటిలో చేసిపెడతాడన్నాడు – ఓ పెద్దమనిషీ! నా పనులు నేనే సొంతంగా చేసుకుంటాను – నువ్వు నీకు చెప్పిన ఆఫీసు పని చేయ్' –"

తరువాత అతను నా వేపు తిరిగి, అన్నారు:

"మూర్తీ! ఈ స్టేట్‌మెంట్ పూర్తిగా తొలి నుంచీ చేసి, రాత్రి ఎంతవేళయినాసరే, నా బంగళాకి మనిషినిచ్చి పంపించు. నేను ఆమోదించిన తరు వాత టైపు చేయించి ఉదయం ఏడు గంటలకు సిద్ధం చేయించు – సీనియర్ ఆఫీసరొకరు రేపు ప్లైట్‌లో ఢిల్లీ వెళ్ళి ఇచ్చివస్తారు."

పెద్ద దొరగారి ఛాంబరు నుంచి ఇద్దరం, ఒకరి వెనుక ఒకరం, కారిడారులో పక్కపక్కలనే నడి చాము. నోరు విప్పి ఎవరం మాట్లాడలేదు.

తరువాత రాజశేఖరం కనిపించలేదు.

ఒక నెల గడచిపోయింది.

అతను ఆఫీసులో చాలా సరదాగా వుండేవాడు. తన గొప్పలు, హెడ్డాఫీసు క్లబ్బులలో తన విజ యాలు ఆఫీసు సూపరింటెండెంటుకు, గుమస్తా లకు వినిపించి, వారికి టీలు తెప్పించి, మస్తుగా కాఫీ క్లబ్బులలో మేపించి, పనులు చేయించుకు న్నాడు – ఎవడో విశ్వాసఘాతకుడు చూసి చూసి అతని వెన్నులో పొడిచాడు.

ఇంకా మరో సంగతి తెలిసింది.

ఈ విధంగా అతను తిట్లు తినడం మొదటి సారి కాదు – ఇంతకన్నా కఠినంగా దొరగారు కేకలేశారుట కూడా.

అతను ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు.

నా ఎదుట దొరగారు మాటలాడకుండా వుంటే బహుశా దులువుకొని పనిచేసేవాడు.

ఏదయితేనేం, ఆదివారం ఉదయాలలో సేమ్యా ఉప్మా, వెన్నతో వేసిన మసాలా దోశెలు, సాంబారులో గారెలు, కలకత్తా నుంచి సీలువేసిన టిన్నులలో వచ్చిన రసగుల్లాలు – ఇవన్నీ నాకు లేకుండా పోయాయి. ◆